


-దూరి వెంకటరావు

వీరాస్వామి క్యాష్ కౌంటర్ ముందు నిలబడి గంటయింది. ఎంత త్వరగా పని ముగించుకుని వెళ్లిపోదామనుకుంటున్నాడో అంత ఆలస్యమవుతోంది.

క్యూలో వెనుకబడి ఉన్నాడా అంటే అందరికంటే ముందే నిలబడ్డాడు.

అయినా క్యాషియర్ అతడు తెచ్చిన డబ్బు తీసుకోవడంలేదు.

ఆ రోజు తనకు ఎన్నో వ్యవసాయ పనులు ఉన్నాయి. కోసిన చెరుకును బళ్ళకెక్కించి ఫ్యాక్టరీకి తీసుకెళ్లాలి.

కూలీలకు బత్తెం చెల్లించాలి. అవన్నీ ప్రక్కన పెట్టి తీసుకున్న ఋణానికి వాయిదా కట్టడం కోసం పొద్దున్నే బయలుదేరి బ్యాంకుకొచ్చాడు వీరాస్వామి.

క్యాషియర్ తన వెనుక ఉన్నవాళ్ల నుంచి డబ్బు తీసుకోవడం చూసి "ఏమయ్యా! ముందు వెనుకా లేదా? నేను గంటయింది ఇక్కడ నిలబడి" అన్నాడు అసహనంగా.

ఆ మాటకు క్యాషియర్ అతడివంక గుర్రుగా చూసాడు.

"నువ్వు పట్టుకొచ్చిన డబ్బు లెక్క పెడుతూ కూర్చుంటే తెల్లవారిపోతుంది. కాస్సేపు ఆగు" అంటూ మరో వ్యక్తి ఇచ్చిన నోట్ల కట్టను అందుకున్నాడు క్యాషియరు.

ఆలోచనలో పడ్డాడు వీరాస్వామి.

క్యాషియర్ మాటలు అతడికేమాత్రం రుచించలేదు. అతడి ధోరణి అందరికంటే భిన్నంగా తోచింది.

చిల్లర ఇచ్చినందుకు పలుచోట్ల అతగాడు ఎన్నో ప్రశంసల్ని అందుకున్నాడు. మరి చిల్లర ఇస్తే ఈ క్యాషియరు ఎందుకు విసుక్కుంటున్నాడో బోధపడడంలేదు.

ఉన్నపళంగా గతంలోకి మళ్ళింది అతడి మనస్సు.

❖ ❖ ❖

ఊరికెళదామని బస్‌స్టాప్‌లో నిలబడ్డాడు వీరాస్వామి

ఇంతలో కిక్కిరిసిన జనంతో బస్సువచ్చి ఆగింది.

"టిక్కెట్టుకు సరిపడా చిల్లర ఉంటేనే ఎక్కండి" అన్నాడు కండక్టర్ కొంచెం విసుగ్గా.

కండక్టర్ మాటలు పట్టించుకోకుండా వీరాస్వామితో పాటు మరి నలుగురు తోసుకుంటూ బస్సెక్కారు.

"ఇలా అందరూ వందలు, యాభైలు ఇస్తే నేనెక్కడ నుంచి చిల్లర పట్టుకొచ్చే దయ్యా. అసలు బస్సు ఆపడమే నా పొరపాటు" విసుక్కున్నాడు కండక్టర్.

వీరాస్వామి సరిగ్గా ఎనిమిది రూపాయలు తీసి లేక్కపెట్టి కండక్టర్ చేతిలో పెట్టేసరికి అతడి మొహం వెయ్యి వోల్టుల విద్యుత్ బల్బులా వెలిగిపోయింది.

"నీలాంటివాళ్లు ఎందరెక్కినా నాకు బాధనిపించదు. ఆ చేత్తోనే ఓ వందరూపాయల చిల్లర కూడా వుంటే ఇవ్వు బాబూ" అంటూ టిక్కెట్టు కోసిచ్చాడు కండక్టర్.

అతడి పొగడ్తలకు ఉబ్బితబ్బిబ్బయ్యాడు వీరాస్వామి. చిల్లర తీసి కండక్టర్‌కు ఇచ్చాడు. అక్కడే కాదు, ఎన్నో చోట్ల చిల్లర ఇచ్చినందుకు ప్రశంసలు అందుకున్నాడు.

◆ ◆ ◆

వీరాస్వామి గతం నుండి వర్తమానంలోకి వచ్చాడు.

ఎందరి నుంచో ప్రశంసలు అందుకున్న తను మరెందుకో ఇక్కడ మాత్రం గుర్తింపు పొందలేకపోయాడు. ఉండబట్టలేక ఆ మాటే బయటకు అనేసాడు.

"బస్సుల్లో, సినిమా హాళ్లల్లో చిల్లర కొరత ఉంటుంది కాబట్టి నువ్విచ్చిన చిల్లర చూసి పొంగిపోయి ఉంటారు. బ్యాంకుల్లో నీవంటివాళ్లంతా కాసులు తెస్తే నా పని సరి. వాటిని లెక్కపెట్టలేక ఉద్యోగానికి రిజైన్ చేసి పోవాలి. పెళ్లికి, పిడుక్కి ఒకటే మంత్రమా?" అన్నాడు క్యాషియర్ అతడి అమాయకత్వానికి నవ్వుకుంటూ.

అతడి మాటలు వీరాస్వామికి అర్థమయ్యాయో లేదో తెలీదుగాని అతడు తెల్లమొహం వేయడం మాత్రం గమనించారక్కడున్న వాళ్లంతా.

(నవంబర్ 2011 ఆంధ్రభూమి మాస పత్రిక)